క్లుప్తంగా

అయ్యప్ప గుడి నిర్మాణానికి విరాళం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప గుడి నిర్మాణం కోసం సాతాపూర్ గ్రామానికి చెందిన దశరథం రూ.5016 లు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వెంకటస్వామి దాతను బుధవారం సన్మానించారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌దీ వక్రబుద్ధి

బిజినేపల్లి: టీపీసీసీ రేవంత్‌రెడ్డి రైతులకు ఉచితంగా అందించే విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి రైతులను తప్పుదోవ పట్టించడానికి బీఆర్‌ఎస్ నాయకులు వక్రబుద్ధి చూపిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, ఉచిత ఎరువుల హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులను మోసం చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో హోమం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బుధవారం గ్రామస్తులు మండల పూజలు నిర్వహించారు. స్థానిక కేదారేశ్వరాలయంలో సామూహిక హోమం చేపట్టారు. శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన దుబ్బ ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో బుధవారం సింగల్‌విండో డైరెక్టర్, మాజీ సర్పంచ్ మోక్తాల శేఖర్‌ముదిరాజ్ బాధితుడిని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

బీజేపీదే విజయం

పెంట్లవెల్లి: కేంద్రం, రాష్ట్రంలో బీజేపీనే విజయం సాధిస్తుందని రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి రోజారమణి అన్నారు. బుధవారం సింగవరంలో మహిళా చైతన్య యాత్రంలో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. కార్యక్రమంలో సుధాకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: బీజేపీ సంస్థాగతంగా బలమైన శక్తిగా ఎదిగిందని, కష్టపడితే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించవచ్చని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ జోనల్ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, మూలె భరత్‌చంద్ర, అన్వేష్, సత్యనారాయణగౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే ఉచిత కరెంట్

అచ్చంపేట: కాంగ్రెస్‌తోనే ఉచిత కరెంట్ సాధ్యమని డీసీసీ అధ్యక్షులు డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత కరెంటు ఇచ్చారని గుర్తుచేశారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

స్థల పరిశీలన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదుట సర్వే నెంబర్ 123లో గల భూమిని బుధవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, సర్పంచ్, అధికారులు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏఈ సాయిరాం, జటప్రోల్ సర్పంచ్ ఎస్‌కే ఖాజా, పాల్గొన్నారు.

నూతనంగా డెయిరీ కోర్సు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కడా లేని విధంగా కల్వకుర్తి మాడల్ డిగ్రీ కళాశాలలో నూతనంగా డెయిరీ కోర్సును ప్రారంభించినట్లుగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలో పారామెడికల్, ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఈ కోర్సు చేసేందుకు అర్హులని ఆయన తెలిపారు.

రెండోఫేజ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తి టౌన్: జిల్లాలోని ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు రెండో ఫేజ్‌లో భాగంగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ లక్ష్మణస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9492182944 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేకుల షెడ్డు ఏర్పాటు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హజరత్ సయ్యద్ ఖాజ దర్గాలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో బుధవారం రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. రూ. 1,65000 వెచ్చించి షెడ్‌ను నిర్మించారు. 13న గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

అచ్చంపేట: సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో ఏడు జీపీఏ నుంచి 10 జీపీఏ మార్కులు సాధించిన విద్యార్థులు ఈనెల 15 వరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి



జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లిలో..



కొల్లాపూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ ఊరేగింపు



కల్వకుర్తిలో..



బిజినేపల్లిలో..



ఊర్కొండలో ధర్నాచేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: రైతులకు అందించే ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ రేవంత్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా, కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తా, బిజినేపల్లి, తిమ్మాజిపేట, పెంట్లవెల్లి, తాడూరు, కొల్లాపూర్ రూరల్ పరిధిలోని కుడికిల్లలో, తెలకపల్లి నెహ్రూ చౌరస్తా, పెద్దకొత్తపల్లి మండలంలోని ముష్టిపల్లి, కోడేరు మండల కేంద్రంతో పాటు పస్పుల, కొండ్రావుపల్లి, తీగలపల్లి,కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా, ఊర్కొండలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వంగూరులో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. చారకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏదిరే రవీందర్, సింగిల్ విండో చైర్మన్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం



బల్మూర్: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారితో కలిసి మండలంలోని నర్సాయపల్లిలో రూ.2 కోట్ల 10లక్షలతో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఎంపీపీ వేనేపల్లి అరుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్య యాదవ్, సర్పంచ్ దేశ్యానాయక్, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చారకొండ: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మండలకేంద్రానికి చెందిన మహేష్, తుర్కలపల్లికి చెందిన పర్వమోని కృష్ణయ్య కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

లింగాల: మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని ఎరువులు, విత్తనాల నిల్వలను, విక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల అమ్మకాలను పీఓఎస్ యంత్రం ద్వారా మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు.

అక్షరాస్యత సాధించాలి

లింగాల: గ్రామ సంఘాలలో ఉన్న మహిళలు అక్షరాస్యత సాధించాలని ఐకేపీ డీపీఎం శ్రీనివాసులు కోరారు. బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు అక్షరాస్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీసీలు శంకర్‌లాల్, దేవన్న, రవి, వీఓఏలు పాల్గొన్నారు.

వెల్దండ: మహిళా సంఘాల్లో ఉన్న మహిళలందరికి విద్య నేర్పించాలని మండల ప్రత్యేక అధికారి, నాన్‌ఫామ్ డీపీఎం నర్సింహ అన్నారు. బుధవారం మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో 41 గ్రామ సంఘాల వీఓఏలకు శిక్షణ అందించారు. ఏపీఎంలు రాములు, సంతోష్,సీసీలు యాదగిరి, రాములయ్య, గెల్వమ్మ, తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ వాసికి డాక్టరేట్

కొల్లాపూర్: పట్టణానికి చెందిన కంటి శ్యాం సుందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్.ఎస్.జితేందర్‌కుమార్ నాయక్ పర్యవేక్షణలో ఐడెంటిఫికేషన్ అండ్ ఎన్యుమరేషన్ ఆఫ్ హెల్మెంథిక్ ప్యారసైట్స్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఇన్ కొల్లాపూర్ రీజియన్ నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై ఆయన పరిశోధనలకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం శ్యాంసుందర్ కోడేరు మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో జంతుశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

ఓపెన్ జిమ్ పరిశీలన



కల్వకుర్తి: పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజల సౌకర్యం కోసం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్ రావు , వైస్ చైర్మన్ షాహెద్, శ్రీనివాసరావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రియల్ ఎస్టేట్ ఏజెన్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి అభి ఆధ్వర్యంలో బుధవారం బాధితుడిని పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

మండల కమిటీ ఎంపిక

అదే విధంగా తెలంగాణ రియల్ ఎస్టేట్ ఏజెన్సీ సంక్షేమ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మహేశ్, ఉపాధ్యక్షులుగా గొర్ల శేఖర్, మండల కమిటీ ఇన్‌చార్జ్‌గా బంగారయ్య ఎన్నికయ్యారు.

సమస్య పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బి అశోక్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ కాలనీలో 200 కుటుంబాలకు రెండు బోర్లు మాత్రమే ఉన్నాయని దీంతో తాగునీరు సరిపోవడం లేదని విన్నవించారు.

యజమానులకు నోటీసులు

కోడేరు: మండల కేంద్రంలో అధికారుల అనుమతులు లేకుండా ఊరకుంట కట్టపై అక్రమంగా డబ్బాలను వేసుకున్న యజమానులకు సాగునీటి అధికారులు జేసీ అరుణ్‌కుమార్ డబ్బాలను తొలగించాలని బుధవారం నోటీసులు జారీ చేశారు.

పోడు భూముల పట్టాలు ఇప్పించండి

లింగాల: మండల కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మండలంలోని మల్లోనిచెర్వుతండా వాసులు బుధవారం కలిశారు. పోడు భూముల పాసు బుక్కులను ఇప్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన లింగాల మాజీ సర్పంచ్ పల్లె నిరంజన్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్ పరామర్శించారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

తెలకపల్లి: మండలంలోని వివిధ పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం శ్రీధర్ శర్మ మాట్లాడుతూ హైకోర్టు తుది తీర్పుకు లోబడి తాత్కాలికంగా పదోన్నతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 20వ తేదీన ఎస్‌పీడీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం ఉంటుందన్నారు.

చర్యలు తీసుకోవాలి

చారకొండ: మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పదర మండలం ఉడిమిళ్ల గ్రామానికి చెందిన అశోక్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఎల్లూరులో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

కొల్లాపూర్ రూరల్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లూరు, లచ్చనాయక్ తండాలలో గ్రామ పంచాయతీ నూతన భవనాలకు ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని కొనియాడారు. అంతకు ముందు అంకిరావుపల్లి గ్రామ సమీపంలో ఉన్న నిచ్చన కొండయ్య గుట్టపై వెలిసిన మదన వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండి లక్ష్మీదేవమ్మ, శంకర్‌నాయక్, ఎంపీటీసీలు పాండునాయక్, శంకర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరణ

బిజినేపల్లి: మండల కేంద్రంలో నూతన ఎస్‌ఐగా రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న సద్దాం హుస్సేన్ నుంచి చార్జ్ తీసుకున్నారు. పెద్దకొత్తపల్లి ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌గా వెళ్లి అక్కడి నుంచి మండలానికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు.

బల్మూర్ ఎస్‌ఐ బదిలీ

బల్మూర్: మండల ఎస్‌ఐ శివానందంగౌడ్ జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూరుకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయన బుధవారం ఇక్కడి నుంచి రిలీవ్ కాగా ఆయనకు సిబ్బంది పలువురు ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు.

పరామర్శ

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన అల్లాజీ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పరామర్శించి ఓదార్చారు.

సాయిచంద్‌కు నివాళులు



తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనదైన శైలిలో రచనలు గానంతో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ సెగను రగల్చిన గొంతుక సాయిచంద్ అని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీఐగా సోమనర్సయ్య

వెల్దండ: సీఐగా సోమనర్సయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ రామకృష్ణ హైదరాబాదులోని ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఐజీ కార్యాలయం నుంచి వెల్దండ సీఐగా సోమనర్సయ్యను నియమించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు



అచ్చంపేటలో..

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యారంగా సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. సందర్భంగా నాయకులు తారాసింగ్, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేటు విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, స్టీఫెన్, సోమశేఖర్, మల్లికార్జున్, అరవింద్, అంజి, పవన్, గెలువయ్య, లక్ష్మన్, రాము తదితరులు పాల్గొన్నారు.


కల్వకుర్తి రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో సురేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పాఠశాలలో బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి తరుణ్, భాను, కార్తీక్, శివ, తదితరులు పాల్గొన్నారు.


అచ్చంపేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బుధవారం బంద్ పాటించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ వెళ్లి పాఠశాలలను మూయించారు. కార్యక్రమంలో వర్ధం సైదులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సుల్తాన్, హరీఫ్, ఫయాజ్, గోపాల్, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

తాడూరు: ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, అందజేయాలని డిమాండ్ చేశారు.

రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించారు



కందనూలులో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కొల్లాపూర్‌లో కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కందనూలు జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట, కొల్లాపూర్, కల్వకుర్తి, ఉప్పునుంతల,బల్మూరు, వంగూరు, అమ్రాబాద్, లింగాలలోని మగ్దూంపూర్ సబ్‌స్టేషన్ల ఎదుట అచ్చంపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వెల్దండలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడిదల రాము, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

ఆటోలు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటోలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీ ప్రధాన రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన బీష్మాచారి ఆటోలో బస్టాండ్ వైపు వస్తుండగా ఉయ్యలవాడ వెళ్తున్న ఆటో రెండు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బీష్మాచారికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సమష్టిగా పట్టణ అభివృద్ధి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీని అన్ని శాఖల సమన్వయంతో సమష్టిగా పట్టణ అభివృద్ధి చేపడదామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాంరెడ్డి, ఇరిగేషన్ డీఈ సుదర్శన్, వెటర్నరీ ఏడీఏ జగదీశ్వరి, డిపో మేనేజర్ శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ శివకృష్ణ, టీపీఓ విజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, మున్సిపల్‌లోని పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

బిజినేపల్లి: వానాకాలంలో రైతులు ఇప్పటికే పత్తి, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను విస్తారంగా సాగు చేశారని, ఆ పంటల సస్యరక్షణ చర్యలకు ఏఈవోల సలహాలు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఏఓ నీతి అన్నారు. బుధవారం మండలంలోని గంగారంలో వ్యవసాయశాఖ అధికారులు రైతుల ఆయా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో ఫరీద్, రైతులు ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు

వెల్దండ: సీఎం కేసీఆర్‌తోనే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారి రవికుమార్‌కు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో రైతు సమితి మండల అధ్యక్షుడు భాస్కర్‌రావు, నాయకులు శేఖర్, దేవేందర్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు

తెలకపల్లి: ఆయా పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. బుధవారం ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల, కస్తూర్బా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై హెచ్‌ఎంలతో చర్చించారు. నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను యూడైస్ క్లాస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. తొలిమెట్టు నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన ఒప్పందాలను అమలు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన 2017–21 రెండు వేతన ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని బుధవారం డివిజనల్ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఏఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ వెంకటయ్య గోపాల్, భాస్కర్‌రెడ్డి, అర్జున్, బాలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాపై అవగాహన

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్, కొరటికల్, విష్ణుపూర్, తిప్పాపూర్ గ్రామాల్లో బుధవారం రైతుబీమా పథకంపై ఏఈఓ భరత్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.